బకాయిల్లో విద్య..!



- పెండింగ్‌లో ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ బిల్లులు
- రూ. 81.89 కోట్లు చెల్లించని గత ప్రభుత్వం
- కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల గగ్గోలు
- ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్న కళాశాల యాజమాన్యాలు



కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 7: గత వైసీపీ ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి ఠంచనుగా జగనన్న విద్యాదీవెన, విద్యా వసతి కింద విద్యార్థులకు ఆర్థిక సాయం చేసినట్లు గొప్పలు చెప్పుకుంది. ఇప్పుడు చూస్తే అంతా దగా అని తేలింది. క్షేత్రస్థాయి వాస్తవాలు వైసీపీ ప్రభుత్వ మోసకారితనాన్ని చాటుతున్నాయి. 2023-2024 విద్యా సంవత్సరానికిగాను కర్నూలు జిల్లాలో డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు(ఆర్టీఎఫ్) (ఎంటీఎఫ్) మెస్ బిల్లులు రూ.81.89 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఆర్టీఎఫ్ రూ. 69.54 కోట్లు, ఎంటీఎఫ్ రూ 23.81 కోట్లు. ప్రైవేట్ కళాశాలల్లో చదివే పి.జి విద్యార్థులను వైసీపీ ప్రభుత్వం వంచించింది. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి సంస్కరణల పేరుతో విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీటెక్, ఫార్మసీ కోర్సులు పూర్తి చేసుకొని కళాశాలల నుంచి బయటకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పెండింగ్ ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అంటున్నాయి. ప్రభుత్వం చెల్లిస్తుందని భరోసాగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పుడు దిక్కుతోచడం లేదు.

● జిల్లాలో విద్యార్థులు మొత్తం ..31462

కర్నూలు జిల్లాలో మొత్తం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు, ఈబీసీ విద్యార్థులు 31,462 మంది ఉన్నారు. ఈ విద్యార్థులు అంతా మెడిసిన్, ఇంజనీరింగ్, బీ. ఫార్మసీ, పీ.జి కోర్సులు చదువుతున్నారు. ఒక్కో విద్యార్థికి కనీస ఫీజు రూ.40 వేలు నుంచి రూ. లక్ష వరకు ఉంటుంది. అకడమిక్ ఇయర్ ముగిసే లోపల ఆర్టీఎఫ్ నాలుగు విడతల్లో తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమచేస్తామని, మెస్ చార్జీల కింద ఏడాదికి రూ10 వేలు, రూ.15 వేలు, రూ.20 వేలు చొప్పున రెండు విడతలో చెల్లిస్తామని అప్పటి సీఎం జగన్ తెలిపారు. అయితే ఒక్కో విద్యార్థికి రూ10 వేలు మాత్రమే జమచేసి, మిగతా మొత్తానికి పంగనామాలు పెట్టారు. 2023-2024 విద్యా సంవత్సరానికి ఒక క్వార్టర్ మాత్రమే చెల్లించి, మిగతా మూడు క్వార్టర్లు పెండింగ్‌లో ఉంచారు.

● జిల్లాలో ఫీజుల బకాయిలు రూ. 81.89 కోట్లు



2023-2024 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని 31,462 మంది విద్యార్థులకు 4 క్వార్టర్ల ద్వారా ఆర్టీఎఫ్ రూ 82.73 కోట్లు నిధుల విడుదల చేయాలి. మొదటి క్వార్టర్ కింద రూ 23.18 కోట్లు మాత్రమే చెల్లించింది. ఇంకా, రూ 69.54 కోట్లు ఫీజులు, మెస్ చార్జీల ద్వారా రూ.3.75 కోట్లు చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులకు 60 శాతం వాటా కింద, రాష్ట్రప్రభుత్వం వాటా కింద 40 శాతం నిధులు కలిపి 7,650 మంది విద్యార్థులకు రూ 1.37 కోట్లు విడుదల చేసింది. మిగిలిన బీసీ, కాపు, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు నయాపైసా ఇవ్వలేదు.

అప్పుల ఊబిలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు



గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు చెల్లించక పోవడంతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు అప్పుల ఊబిలోకి కూరుకపోయాయి. ఫీజులు విడుదలకాక ఉద్యోగులకు అప్పులు తెచ్చి వేతనాలు చెల్లిస్తున్నారు. కొందరు ఏకంగా ఇంజనీరింగ్ కళాశాలను మూసివేశారు. మరి కొందరు కొన్ని కోర్సులు రద్దు చేసుకున్నారు. కళాశాలల నిర్వహణ కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నడుపుతున్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో 20 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండేవి. ఇప్పుడు 12 మాత్రమే ఉన్నాయి. గత ప్రభుత్వం ఒక్కో కళాశాలకు ఆర్టీఎఫ్ (ఫీజులు) రూ 9 కోట్లు వరకు పెండింగ్‌లో పెట్టింది.

● పెండింగ్ ఫీజులు చెల్లించాలి..



గత వైసీపీ ప్రభుత్వం ఫీజులు, మెస్ చార్జీలు పెండింగ్‌లో ఉంచడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత విద్యా సంవత్సరానికి నాలుగు క్వార్టర్లకు ఒక క్వార్టర్ మాత్రమే చెల్లించింది. మూడు విడతలు పెండింగ్‌లో ఉన్నాయి. ఫీజులు కట్టి, సర్టిఫికెట్లు తీసుకోలేక విద్యార్థులు పై చదువులకు వెళ్లలేకపోతున్నారు. ఉద్యోగాలు చేసే అవకాశాన్ని కోల్పోతున్నారు.

-రాజేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి

● రూ. 8 కోట్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి



మా విద్యా సంస్థకు రూ 8 కోట్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త విద్యా సంవత్సరం మొదలైనా ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకలేదు. ఉద్యోగుల జీతాలు, నిర్వహణ భారమైంది. ఇక ఫార్మ డీ కోర్సుకు ఫీజులే ఇవ్వమని గత ప్రభుత్వ చేతులు ఎత్తేసింది. కొత్త ప్రభుత్వం అయినా ఫీజులు చెల్లించి, కళాశాలల యాజమాన్యాలను ఆదుకోవాలి.

- కేవీ విద్యా సంస్థల అధినేత
డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కర్నూలు

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు

● జిల్లాలో 1,457 కమిటీలు ఎన్నికలకు సిద్ధం



ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 7: కర్నూలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ యజమాన్యాల పాఠశాలల కమిటీల ఎన్నికలకు జిల్లా విద్యా శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో 1457 కమిటీలు ఉన్నాయి. వీటి ఎన్నికలకు అన్ని చర్యలను విద్యాశాఖ అధికారులు తీసుకున్నారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి కమిటీ సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు.

టీడీపీ, వైసీపీ మధ్య పోటాపోటీ

స్థానిక సంస్థల ఎన్నికల తరహాలో ప్రచారాలు



మొలగవల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు/గోనెగండ్ల/ ఆదోని (అగ్రికల్చర్)/ఆగస్టు 7: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు అధికార టీడీపీతో పాటు వైసీపీ నాయకులు కూడా సన్నద్ధమయ్యారు. గురువారం జరగనున్న ఈ ఎన్నికలు అధికార పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి.. ఆలూరు మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరగనున్నట్లు ఎంఈవో కోమలదేవి బుధవారం తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. అయితే స్థానిక సంస్థల తరహాలో గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఈ ఎన్నికలు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారనున్నాయి. మొలగవల్లి గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు.. ఈ గ్రామంలో ఎన్నికలు పోటా పోటీగా జరగనున్నాయి. టీడీపీ నేతలు వీరభద్ర గౌడ్, వైకుంఠం శివప్రసాద్, ఎమ్మెల్యే విరూపాక్షి తమ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆదోని, గోనెగండ్ల, ఎమ్మిగనూరు టౌన్, ఎమ్మిగనూరు రూరల్, నందవరం మండలాల్లో ఈ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చొరవతో గ్రామాలలో పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ మెంబర్లుగా పోటీ చేసేవారి ఎంపిక జరిగింది. ఇక వైసీపీ నాయకుల నామమాత్రమైన పోటీకి సిద్ధపడటం లేదు. ఆదోని నియోజకవర్గంలో 130 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో ఉన్నత పాఠశాలలు 23, ప్రాథమికోన్నత పాఠశాల 20, ప్రాథమిక పాఠశాలలు 87 ఉన్నాయి. వీటన్నిటిలో నేడు ఎస్ఎంసీ ఎన్నికలు జరిపేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధం చేశారు.

చెన్నైకి ఇంద్ర ఏసీ సర్వీసు



కర్నూలు(రూరల్)ఆగస్టు 7: కర్నూలు-2డిపో నుంచి వారాంతంలో చెన్నైకు ఇంద్ర ఏసీ సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సర్దార్‌హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు నంద్యాల ఆళ్లగడ్డ, మైదుకూరు, కడప, తిరుపతి మీదుగా వెళ్లనున్నట్లు ఆయన వివరించారు.

రుణాల పేరిట రూ.లక్షల్లో వసూలు

● హైదరాబాద్ కేంద్రంగా స్పాట్ రుణాల యాప్‌తో ఓ మహిళ టోకరా
● పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఆలూరు, ఆగస్టు 7: స్పాట్ రుణాల పేరుతో ఓ మహిళ రూ. లక్షల్లో వసూలు చేసిన విషయం వెలుగులోకి రావడంతో బాధితులు బుధవారం ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ కేంద్రంగా ఈ స్పాట్ లోన్ యాప్‌లో మెంబర్స్‌గా చేరితే లోన్లు వస్తాయని కోయ నగర్‌కు చెందిన ఓ చీరల వ్యాపారి నిరుద్యోగులు, మహిళలను నమ్మించి రూ.10వేలు చెల్లిస్తే రూ.20వేలు, రూ.50వేలు ఇస్తే రూ.1లక్ష రుణాలు వస్తాయని నమ్మించి ఏకంగా రూ.30 లక్షలకు పైగా వసూలు చేసింది. ఇందులో పోలీసులు అధికారి బంధువు కూడా మోసపోయినట్లు తెలిసింది. చివరకు బాధితులు పోలీసులకు ఆశ్రయించారు. సదరు మహిళను పిలిపించి విచారణ చేస్తున్నట్లు ఆలూరు ఎస్సై ఓబులేష్ తెలిపారు.

జగన్ కోర్టుకు వెళ్లడం సిగ్గు చేటు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), ఆగస్టు 7: ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి తనకు మరింత భద్రత పెంచాలని కోర్టును ఆశ్రయించడం సిగ్గు చేటని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక నేరాల కేసుల్లో 16 నెలలు జైలు జీవితం గడిపి బెయిల్‌పై బయట తిరుగుతున్న జగన్‌కు ప్రస్తుతం మాజీ సీఎంకు ఉన్న భద్రత కొనసాగించినప్పటికీ ప్రభుత్వంపై ఆనవసరంగా ఆరోపణలు చేస్తూ రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్నాయని, చంద్రబాబుపై తప్పుడు ప్రచారాలు చేయడం దిగజారుగు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

రేపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 7: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు, గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అవినీతి రాబందు

● అక్రమాల పుట్టగా తహసీల్దార్ కార్యాలయం
● దళారులుగా వీఆర్వోలు, తలారులు, కంప్యూటర్ ఆపరేటర్



హొళగుంద తహసీల్దార్ కార్యాలయం

హొళగుంద, ఆగస్టు 7: రైతులకు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనులు చేయాల్సిన ఓ ఉన్నత అధికారికి అక్రమార్జనే ధ్యేయంగా మారింది. హొళగుంద తహసీల్దార్ కార్యాలయం అవినీతి అడ్డగా తయారైంది. పైసలిస్తేనే పనులు చేస్తామంటూ బహిరంగానే ఓ ఉన్నత అధికారి అంటున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి పనికి ఓ ధర నిర్ణయించి దళారులుగా వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, తలారులను (గ్రామ సేవకుల) ఏర్పాటు చేసుకొని, వారి ద్వారా వేలు, లక్షల రూపాయలు అక్రమ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారిని ప్రశ్నించినవారి పని చేయకుండా కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిప్పుకుంటాడనే విమర్శ ఉంది. మరల్లమడికి గ్రామానికి చెందిన రైతు పాస్ బుక్ కోసం వెళితే అధికారి డబ్బులు డిమాండ్ చేశాడని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు ఫిర్యాదు చేశాడు. దీనికి ఆగ్రహించిన సబ్ కలెక్టర్ అక్షింతలు వేసినా అధికారి వక్ర బుద్ధి మారలేదు. ఇట్లా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి వల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అంటున్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో పోలీసు ఫిర్యాదు ప్రాధికారత సంస్థ



మాట్లాడుతున్న చైర్మన్ వెంకరమణారెడ్డి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 7: పోలీసుల నుంచి వేధింపులకు గురవుతున్న బాధితులకు అండగా ఉండేందుకు పోలీసు శాఖలో పారదర్శకత కోసం సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకే కలెక్టరేట్ కార్యాలయంలో పోలీసు ఫిర్యాదు ప్రాధికారత సంస్థ ఏర్పాటు చేశారు. పోలీసు శాఖలో పారదర్శకత కోసం, పోలీసులపై ఆరోపణలు, బాధితులను వేధించడం వంటి సంఘటనలపై విచారణ జరిపేందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం 2006లో సీజేఐ సబర్వాల్, టక్కర్, సుబ్రహ్మణ్యంలతో కూడిన పూర్తిస్థాయి బెంచ్ రాష్ట్రాల్లో పోలీసుల పిర్యాదు అథారిటీని ఏర్పాటు చేయాలంటూ తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో.125 2020లో హోంశాఖ లీగల్ నుంచి పోలీసుల ఫిర్యాదుల అథారిటీని ఏర్పాటు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోలీసు కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్‌గా విశ్రాంత న్యాయాధికారి కుప్పం వెంకటరమణారెడ్డి, సభ్యులుగా రిటైర్డు డీఎస్పీ రాఘవరెడ్డి, రిటైర్డు ఆర్డీవో శశిదేవి, సోషల్ ఆక్టివిటీ కింద అడ్వకేట్ నాగశేషారెడ్డి నియమితులయ్యారు.

44 మంది ఎస్ఐలు బదిలీ

కర్నూలు, ఆగస్టు 7: కర్నూలు, నంద్యాల జిల్లాలో 44 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రస్తుతం కర్నూలు జిల్లాకు సంబంధించిన పోలీస్‌స్టేషన్లకు మాత్రమే ఎస్ఐలను మాత్రమే కేటాయించారు. నంద్యాల జిల్లాకు సంబంధించిన పోలీస్‌స్టేషన్లకు ఎస్ఐలను ఇంకా కేటాయించలేదు. ఓర్వకల్లు ఎస్ఐగా సునీల్ కుమార్‌ను, ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు, జొన్నగిరికి శ్రీనివాసులు, మద్దికెరకు విజయకుమార్, తుగ్గలికి కృష్ణమూర్తి, వెల్దుర్తికి అశోక్, కృష్ణగిరికి మల్లికార్జున, ఆలూరుకు వెంకట నరసింహులు, చిప్పగిరికి రమేష్‌బాబు, హాలహర్వికి చంద్ర, కౌతాళం ఎస్ఐగా రిజ్వాన్, కోసిగి ఎస్ఐగా చంద్రమోహన్, పెద్దకడుబూరుకు నిరంజన్ రెడ్డి, కే.నాగులాపురం ఎస్ఐగా ఆశాలత, కోడుమూరుకు ఎస్ఐగా శ్రీనివాసులు, గూడూరుకు తిమ్మయ్య, ఇస్వీ ఎస్ఐగా నాగేంద్ర, ఆదోని రూరల్ ఎస్ఐగా రామాంజనేయులు, మాధవరానికి విజయకుమార్, పెద్దతుంబళం ఎస్ఐగా మహేష్ కుమార్, ఉలిందకొండకు ధనుంజయలను నియమించారు.

● కర్నూలు ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చంద్రశేఖర్ రెడ్డి (వెల్దుర్తి), సమీర్‌బాషా (కర్నూలు తాలుకా), కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు శివశంకర్ నాయక్ (బేతంచెర్ల), మధుసూదన్ (ఏపీఎస్‌హెచ్ఆర్‌సీ), తాలుకా పోలీస్‌స్టేషన్‌కు రామాంజనేయులు (సీఐడీ), నరేష్ (ఉలిందకొండ), మహ్మద్ రఫీ (వీఆర్), అలాగే కర్నూలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బాల నరసింహులు (కోడుమూరు), సోమ్లా నాయక్ (వీఆర్), కర్నూలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు మోహన్ కిషోర్ రెడ్డి (కర్నూలు ఫోర్త్‌టౌన్)లను నియమించారు.

● గూడూరులో ఉన్న హనుమంతయ్యను స్పెషల్ బ్రాంచ్‌కు, కర్నూలు త్రీటౌన్ పీఎస్‌లో ఉన్న రామకృష్ణయ్యను డీసీఆర్‌బీకి కేటాయించారు.

● రాజారెడ్డి (ఓర్వకల్లు), శరత్ కుమార్ రెడ్డి (ఎమ్మిగనూరు రూరల్), మల్లికార్జున (తుగ్గలి), ఓబులేసు (ఆలూరు), నరేంద్ర (హాలహర్వి), పెద్దయ్య నాయుడు (హోళగుంద), నరేంద్ర కుమార్ రెడ్డి (కౌతాళం), సతీష్ కుమార్ (కోసిగి), ఎర్రిస్వామి (ఆదోని రూరల్), చిన్న వీరయ్య (పెద్దతుంబళం)ను కర్నూలు వీఆర్‌కు పంపారు.

జీవితాలకు నవోదయం

● మనసు పెట్టి చదివితే సీటు సొంతం ● ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల



నవోదయ విద్యాలయం ప్రధాన కార్యాలయం

ఎమ్మిగనూరు, ఆగస్టు 7: నవోదయలో చదివితే విద్యార్థి జీవితానికి మంచి పునాదులు పడతాయి. విద్యారంగంలో నవోదయ విద్యాలయాన్ని మించింది లేదనే గుర్తింపు ఉంది. ఐఏఎస్, ఐపీఎస్‌లు మొదలు ఉన్నతాధికారులుగా స్థిరపడిన చాలా మంది నవోదయలో చదువుకున్నవారే. కాస్త కష్టపడి చదివితే సీటు సంపాదించడం పద్ద కష్టం కాదని అంటా రు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో 1987లో బనవాసి ఫారం దగ్గర నవోదయ విద్యాలయాన్ని ఎంతో అహ్లాదకరమైన వాతావరణంలో 32 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ విద్యాలయంలో వేల మంది చదువుకున్నారు. ఇక్కడ చదువుకున్నవారిలో నలుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్‌లు ఉన్నారు. వంద మంది డాక్టర్లు, వెయ్యిమందికి పైగా ఇంజనీర్లు, ఎస్సైలు, డీఎస్పీలు, టీచర్లు వేల సంఖ్యలో ఉండడం విశేషం. నవోదయలో తమ పిల్లల్ని చదివించాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అక్కడ చదివితే తప్పక మంచి భవిష్యత్ ఉంటుందని నమ్మకం. నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ప్రవేశ పరీక్ష తప్పనిసరి.

● **రిజర్వేషన్లు:** విద్యాలయంలోని 80 సీట్లలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 75శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25శాతం కేటాయించారు. ఇందులో బాలికలకు 33శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, వికలాంగులకు 3శాతం, మిగిలినవి జనరల్ కింద రిజర్వేషన్లు ఉంటాయి.

● **జనవరి 18న ప్రవేశ పరీక్ష:** దేశ వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష 18.1.2025వ తేదీన ఉంటుంది. ఈ పరీక్షా పత్రం విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేందుకు అన్ని భాషల్లో ప్రశ్నా పత్రాలు ఉంటాయి. ఓఎమ్మార్ సీటు లో జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇందుకుగాను విద్యార్థులు తప్పని సరిగా బ్లాక్ లేదా బ్లూ బాల్‌పెన్‌లను మాత్రమే ఉపయోగించాలి. కొట్టి వేతలు ఉంటే దాన్ని పరిగణలోకి తీసుకోరు.

● **ఎంపిక పరీక్షా విధానం:** ప్రశ్నా పత్రం వంద మార్కులకు ఉంటుం ది. ఇందులో విభాగం-1లో మేధాశక్తి- 50 మార్కులు, విభాగం-2లో గణితం -25, విభాగం-3లో భాషాపరిజ్ఞానానికి - 25మార్కులు ఉంటాయి. రెండు గంటల వ్యవధిలో వంద మార్కుల ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుంది. అభ్యర్థి పరీక్ష రాసే భాషను సమాచార సంచికలో సూచించిన 21 భాషలలో ఏదైనా ఒక భాషను ఎంచుకోవాలి.

● **ఒకేసారి అవకాశం:** నవోదయ విద్యాలయంలో చేరేందుకు ప్రవేశపరీక్షకు ఒకసారి మాత్రమే అవకాశం ఉంటుంది. రెండోసారి ప్రవేశ పరీక్షరాసినా ఎంపిక సమయంలో ఆ విద్యార్థి దరఖాస్తును తొలగిస్తారు.

● **ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల:** దేశంలోని 28 రాష్ట్రాల్లో, ఏడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 625 విద్యాలయాలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. పూర్తి చేసిన దరఖాస్తులను 16.9.24వ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి ప్రవేశ పరీక్ష జనవరి 18 2025న ఉంటుంది.

● **అర్హతలు :** ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు 1.5.2013 నుండి 31.7.2015 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా పాఠశాలలో 3,4 తరగతుల్లో ఉత్తీర్ణులై ప్రస్తుతం 5వ తరగతి చదువున్న వారు అర్హులు.

● **సౌకర్యాలు:** బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం, అర్హత, అనుభవం కలిగిన బోధనా సిబ్బంది, విద్యలో సాంకేతిక, శాస్త్ర సమాచారం తగిన సహపాఠ్య కార్యక్రమాలను, క్రీడలను, ఆటలు, యోగా పొందుపరచడం, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, స్టేషనరి, భోజన వసతి మొదలగునవి ఉచితంగా ఇస్తారు. ఐఐటీ, నీట్, ఎన్ఐటీ, ఏఐఈఈకి ప్రత్యేక శిక్షణ, 1.40 నిష్పత్తిలో విద్యాబోధన, కంప్యూటర్ విద్య కోసం రెండు ల్యాబ్‌లు ఉన్నాయి. బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ అంశాల్లో ప్రయోగాలకు ల్యాబ్‌లు ఉంటాయి.

● **దరఖాస్తు చేసుకొనే విధానం :** విద్యార్థులు పూర్తిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌టీటీపీఎస్//సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐఎల్.జీఓవీ.ఇన్/ఎన్‌వీఎస్ కు నిర్దేశిత పత్రాలను జతచేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

● **అవంతి లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్:** నవోదయ విద్యాలయంలో ఈ ఏడాది అవంతి లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్ మంజూరయ్యింది. దీన్ని ఈనెల 22 న ప్రిన్సిపాల్ పద్మావతి ప్రారంభించారు. రాష్ట్రంలోని 11 జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 40మంది విద్యార్థులు అవంతికి ఎంపికయ్యారు.



తరగతి గదుల్లో విద్యార్థులు



లైబ్రరీలో విద్యార్థులు



ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

రోజూ ఐదు గంటలు చదివా



మా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళుతూనే రోజు సాయంత్రం 5 గంలనుంచి 10గంల వరకు ప్రవేశ పరీక్ష కోసం మా అమ్మా నాన్న చదివించేవారు. ఇలా నాలుగు నెలల పాటు చడవడం వల్లే నాకు సీటు వచ్చింది.

- సుహనీ ప్రియ, 6వ తరగతి, అనుగొండ కోడుమూరు మండలం, కర్నూలు జిల్లా

ప్రత్యేక శిక్షణతో సీటు సాధించా



మాది బనగానపల్లె. మా ఊరిలో ఉన్న ప్రయదర్శిని పాఠశాలలో చదివే సమయంలో ఉపాధ్యాయులు నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు చదివి సీటు సాధించా.

- కే.సుచంద్ర, 6వ తరగతి, బనగానపల్లె, నంద్యాల జిల్లా

ప్రణాళిక ప్రకారం చదివితే..



విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో రెండు మూడు నెలలు కష్టపడి చదివితే సులువుగా ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత కావచ్చు. నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నాం.

- ఈ పద్మావతి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం, బనవాసి, ఎమ్మిగనూరు మండలం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన, నాయకుల అరెస్టు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 7: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమం ఉద్రిక్తంగా మారడంతో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టరేట్ కార్యాలయం గేట్లు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు విలయతాండవం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4,500 ప్రాథమిక పాఠశాలలు మూసివేసిందని అన్నారు. 84, 85, 117 జీవోలను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నాయకులు నరేష్, రసూల్, రామకృష్ణ, ప్రశాంత్, వీరేష్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

ముగ్గురు సీఐలకు అటాచ్‌మెంట్

కర్నూలు, ఆగస్టు 7: నంద్యాల జిల్లాలో ముగ్గురు సీఐలకు అటాచ్‌మెంట్లు ఇచ్చారు. డోన్ రూరల్ సర్కిల్‌లో ఉన్న అస్రార్ బాషాకు ప్యాపిలి సర్కిల్, నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌లో ఉన్న వంశీధర్‌కు పాణ్యం సర్కిల్, ఆత్మకూరు యూపీఎస్‌లో ఉన్న లక్ష్మీనారాయణకు ఆత్మకూరు రూరల్ సర్కిల్‌లను తాత్కాలికంగా అటాచ్‌మెంట్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు రోజుల్లో ఆయా సర్కిళ్ల పరిధిలో కొత్త సీఐలకు పోస్టింగులు ఇవ్వనున్నారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

డోన్(రూరల్), ఆగస్టు 7: మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో పొలంగట్టు వివాదంలో జరిగిన ఘర్షణలో గాయపడిన మాధవయ్య (55) బుధవారం కోలుకోలేక మృతి చెందాడు. నెల రోజుల క్రితం జరిగిన ఈ ఘర్షణలో చికిత్స పొంది తిరిగి ఇంటికి చేరుకున్న మాధవయ్య మరలా అస్వస్థతకు గురయ్యాడు. డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందినట్లు డోన్ పట్టణ ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు. మృతుని కుటుంబానికి వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు పరామర్శించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

నంద్యాల క్రైం, ఆగస్టు 7 : సీతారామాపురం హత్యకేసులో నిందితులను అరెస్టు చేసినట్లు నంద్యాల ట్రాఫిక్, నంద్యాల తాలుకా ఇన్‌చార్జి సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు, నంద్యాల డీఎస్పీ ఎన్. రవీంద్రనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో తాను, బండిఆత్మకూరు ఎస్సై మల్లికార్జున, సీసీ నాగార్జునరెడ్డి, గోస్పాడు ఎస్సై తదితరులతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి 12.20గంటల సమయంలో సీతారామాపురం గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడు (68) అనే వృద్ధుడిని కత్తులు, రాళ్లు, కట్టెలు, ఇనుపరాడ్లతో దాడిచేసి హత్యచేసిన కేసులో అదే గ్రామానికి చెందిన బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి వర్గానికి చెందిన 11మంది నిందితులను బుధవారం ఉదయం 9.45గంటలకు నంద్యాల-చాపిరేవుల రోడ్డులో చాపిరేవుల అండర్‌పాస్ దగ్గర అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు కత్తులు, మూడు కట్టెలు, రెండు సెల్‌ఫోన్లను, స్కోడా కంపెనీకి చెందిన ఏపీ 21 ఏఎం 3333 కారును, ఫార్చునర్ కంపెనీకి చెందిన ఏపీ 40 4251గల కారును సీజ్ చేశామన్నారు. నిందితులు బుడ్డారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వంగాల లక్ష్మిరెడ్డి, వంగాల పుల్లారెడ్డి, బుడ్డారెడ్డిగారి లక్ష్మినాగశేఖర్‌రెడ్డి అలియాస్ కుంటి శేఖర్‌రెడ్డి, తాలూరి శ్రీనివాసులు అలియాస్ దుబ్బ శ్రీను, పెరుమాళ్ల వెంకటరమణ అలియాస్ డీలర్ రమణ, మైలాపురం రామచంద్రరెడ్డి, దూదేకుల బాలహుసేని, జిల్లెల్ల భాస్కర్, గని రంగస్వామి, వంగాల ఈశ్వర్‌రెడ్డిలుగా డీఎస్పీ పేర్కొన్నారు. హత్యకేసులో మిగతా నిందితులను అదుపులోకి తీసుకోవడానికి ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని డీఎస్పీ వెల్లడించారు.

గిరిజన యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి, ఆగస్టు 7: మండలంలోని ఎర్రమఠం గిరిజన గూడానికి చెందిన కుడుముల లింగన్న (20) అనే గిరిజన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రమఠం గూడెంకు చెందిన కుడుముల తిక్కోడు కుమారుడు లింగన్నకు గత రెండేళ్ల క్రితం అదే గూడేనికి చెందిన లింగమ్మ అనే యువతితో వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి లింగన్న తరచూ మద్యం సేవిస్తూ భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి కుడుముల తిక్కోడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

గడియారం ఆసుపత్రి వద్ద వ్యక్తి హత్య

కర్నూలు, ఆగస్టు 7: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గడియారం ఆసుపత్రి సమీపంలో కురువ శివ (40) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ-తాండ్రపాడుకు చెందిన ఈయన కొద్ది కాలం కింద భార్యను వదిలేశాడు. గడియారం ఆసుపత్రి వద్ద వర్మ కాంపౌండులో ఐదేళ్ల నుంచి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ కాంపౌండులో ఉన్న స్థలంలో బిల్డింగ్ కట్టే ప్రయత్నంలో కొట్టం వేసి శివను అక్కడ వాచ్‌మెన్‌గా నియమించారు. గుర్తు తెలియని వ్యక్తులు శివను క్రికెట్ బ్యాట్‌తో తలపై మోదీ హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు శివ మృతదేహాన్ని పరిశీలించారు. ఓ మహిళతో వివాహేతర సంబంధంతోనే ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ పవన్ కుమార్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

ఓర్వకల్లు, ఆగస్టు 7: మండలంలోని గుమితం తండాలోని పొలంలో బుధవారం సేద్యం పనులు చేస్తుండగా. ట్రాక్టర్ తిరబడి గోపినాయక్ (37) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

బ్యాంకాక్ నుంచి క్షేమంగా వచ్చిన మధుకుమార్

● సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన డోన్ ఎమ్మెల్యే కోట్ల ● కిడ్నాప్ కథ సుఖాంతం..



డోన్‌లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో ఉన్న మధుకుమార్, కుటుంబ సభ్యులు

డోన్, ఆగస్టు 7: బ్యాంకాక్‌లోని థాయ్‌లాండ్‌లో డోన్‌కు చెందిన మధుకుమార్ కిడ్నాప్ కథ సుఖాంతమైంది. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతో ఎట్టకేలకు మధుకుమార్ బ్యాంకాక్ నుంచి క్షేమంగా తిరిగి ఇంటికి చేరుకున్నాడు. డోన్ మండలంలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మధుకుమార్ బీటెక్ పూర్తి చేశాడు. బెంగుళూరులో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా.. ఒక ఏజెన్సీ ద్వారా బ్యాంకాక్‌లో ఉద్యోగం కోసం గత నెల 22వ తేదీన బెంగుళూరు నుంచి వెళ్లాడు. అయితే.. ఏజెన్సీ సభ్యులు చెప్పినట్లుగా మధుకుమార్‌కు ఉద్యోగం లేదని తేలిపోయింది. కొందరు ముఠాగా ఏర్పడి మధుకుమార్‌ను కిడ్నాప్ చేసి థాయ్‌లాండ్‌కు తీసుకెళ్లారు. డబ్బులు ఇస్తేనే విడుదల చేస్తామని బెదిరించారు. మొదట రూ.20 లక్షలు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు చివరకు రూ.8 లక్షలు ఇస్తేనే వదిలిపెడతామని వేదింపులకు గురి చేసినట్లు బాధితుడు మధుకుమార్ తెలిపారు. లేదంటే చంపేస్తామని హెచ్చరించారు. దీంతో కిడ్నాప్‌కు గురైన మధుకుమార్ వ్యవహారాన్ని బాధితుడి తల్లిదండ్రులు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి మధుకుమార్ కిడ్నాప్ వ్యవహారాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం చంద్రబాబు కర్నూలు రేంజ్ డీఐజీతో పాటు కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడారు. మధుకుమార్‌ను ఇండియాకు తీసుకుచ్చే బాధ్యతను వారికి అప్పగించారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎప్పటికప్పుడు జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో, కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతూ వచ్చారు.

● పొదుపు మహిళలతో అప్పులు తీసుకుని కిడ్నాపర్లకు రూ.8 లక్షలు ఖాతాలోకి:

థాయ్‌లాండ్‌లో కిడ్నాపర్ల చెరలో ఉన్న మధుకుమార్‌కు బెదిరింపులు తీవ్రమయ్యాయి. దీంతో తల్లిదండ్రులు పొదుపు మహిళలతో మాట్లాడి, ఒక్కో గ్రూపు నుంచి రూ.లక్ష చొప్పున 8 గ్రూపుల నుంచి రూ.8 లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ మొత్తాన్ని కిడ్నాపర్లు పంపిన మూడు బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారు. రూ.8 లక్షలు ముట్టిన తర్వాత మధుకుమార్‌ను విడిచిపెట్టారు. దీంతో విమానంలో బెంగుళూరు వచ్చి బుధవారం ఉదయం డోన్‌కు చేరుకున్నాడు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి మధుకుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

● ఏజెన్సీలను నమ్మి మోసపోవద్దు: కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే, డోన్:

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రైవేటు ఏజెన్సీలు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో మధుకుమార్‌తో పాటు తల్లిదండ్రులతో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడి భరోసా ఇచ్చారు. అన్ని రకాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ



హాస్టల్ వద్ద పరిశీలిస్తున్న ఆర్డీవో

కోడుమూరు (రూరల్), ఆగస్టు 7: మండలంలోని అమడగుంట్ల బీసీ హాస్టల్‌లో విద్యార్థి వీరేష్‌ఆచారి (13) భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆర్డీవో శేషిరెడ్డి, డీఈవో శామ్యూల్ వేర్వేరుగా విచారణ జరిపారు. ముందుగా ఆర్డీవో శేషిరెడ్డి పాఠశాలలో విచారణ జరిపారు. హెచ్‌ఎంను అడిగి విద్యార్థి అడ్మిషన్ వివరాలపై తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా 7, 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో సౌకర్యాలు, మెనూపై ఆరా తీశారు. ఆపై హాస్టల్ వద్దకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును వార్డన్ ప్రసన్నకుమార్ నుంచి వివరాలు రాబట్టారు. అనంతరం ఆర్డీవో కోడుమూరు చేరుకుని ప్రభుత్వాసుపత్రిలో విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులను పరామర్శించారు. తాము పేదరికం అనుభవిస్తున్నా పిల్లలను చదివించుకోవాలని కలలు కన్నామని, తమ ఆశలు ఆవిరయ్యాయని విద్యార్థి తల్లిదండ్రులు బ్రహ్మయ్యఆచారి, రాధమ్మ రోదించారు. ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. డీఈవో శామ్యూల్ కూడా విద్యార్థి ఆత్మహత్య ఘటనపై పాఠశాల, హాస్టల్ వద్ద విచారణ జరిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎంఈవోలు వసంతలక్ష్మి, శరభయ్య హెచ్‌ఎం అనంతయ్యయాదవ్ పాల్గొన్నారు.

20 ఇళ్లకు షార్ట్ సర్క్యూట్

● కాలిపోయిన టీవీలు, ఫ్యాన్లు

● విద్యుత్ సబ్ స్టేషన్ ముందు కాలనీవాసుల ధర్నా

మద్దికెర, ఆగస్టు 7: స్థానిక గిడ్డయ్యవీధిలో హైవోల్టేజీ వల్ల 20 ఇళ్లకు షార్ట్ సర్క్యూట్ వచ్చి పది టీవీలు పూర్తిగా కాలిపోయాయి. పది ఫ్యాన్లు, పది బల్బులు, లైట్లు, గృహ పరికరాలు కూడా కాలిపోయాయి. దీంతో ఆగ్రహించిన కాలనీవాసులు విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. బుధవారం స్థానిక గిడ్డయ్య వీదిలో ఉదయం విద్యుత్ హైవోల్టేజీ వల్ల ఇళ్లకు షార్ట్ సర్క్యూట్ రావడంతో కాలనీలోని దేవేంద్ర, హుశేన్‌సాబ్, రాజు, నబీసాబ్, గోపాల్, శ్రీనివాసులు మరో 14 గృహాల్లోని ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయి. దీంతో కాలనీవాసులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా విద్యుత్ హై వోల్టేజీ వస్తున్నదని విద్యుత్ అధికారులు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని కాలనీవాసులు రామాంజులు, రుద్ర, వెంకటేశ్, గోపాల్ తదితరులు అన్నారు. అధికారులు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ మహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు.



విద్యుత్ ఏఈ మహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 7: పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని మెంబర్ ఆఫ్ స్టేట్ ఉమెన్ కమిషన్ రుఖియాబేగం అన్నారు. నగరంలోని బీ.క్యాంపు సీడీపీవో కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెంబర్ ఆఫ్ స్టేట్ ఉమెన్ కమిషన్ హాజరై మాట్లాడారు. బిడ్డకు తొలి ఆహారం అమ్మ పాలే అని, ఇది బిడ్డ ఎదుగుదలకు పని చేస్తుందన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన ప్రతి తల్లి మొదట ముర్రుపాలు తాగించినట్లయితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎక్కువగా విటమిన్స్ ఉండే పదార్థాలు తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ పరిపుష్టిగా ఉంటారన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు విజయవంతం గా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన శిశువు..!

శిరివెళ్లలో ఘటన

శిరివెళ్ల, ఆగస్టు 7: అప్పుడే పుట్టిన పసికందు.. కళ్లు తెరిచి లోకం చూస్తుండగానే తల్లి ఒడిని వీడి రోడ్డు పక్కకు చేరింది. ఈ ఘటన శిరివెళ్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. శిరివెళ్లలోని పోలీస్‌స్టేషన్ మీదుగా గోవిందపల్లెకు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన ఓ ప్లాసిక్ కవర్‌లో చుట్టిపెట్టిన పసికందును గ్రామానికి చెందిన రఫీ, మరికొందరు గుర్తించారు. వెంటనే వారు ఆ శిశువును అక్కున చేర్చుకుని శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. ఎస్ఐ సురేష్ స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఐసీడీఎస్ ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్విని, శిరివెళ్ల సూపర్‌వైజర్ సువర్ణలతకు ఎస్ఐ సురేష్ శిశువును అప్పగించారు. శిశువు ఆరోగ్యంగా ఉందని, నిబంధనల మేరకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంరక్షణ కల్పిస్తామని సీడీపీవో తేజశ్విని వెల్లడించారు.



నవజాత శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న ఎస్ఐ సురేష్

కేసీ కాలువలో పడి వ్యక్తి మృతి

చాగలమర్రి, ఆగస్టు 7: చాగలమర్రి గ్రామానికి చెందిన రామచంద్రుడు (50) అనే వ్యక్తి బుధవారం కేసీ కాలువలో పడి మృతి చెందాడు. చాగలమర్రి గ్రామ సమీపంలోని కేసీ కాలువలో ప్రమాదవశాత్తు కాలువ నీటిలో పడ్డాడు. కడప జిల్లా కానగూడురు గ్రామ సమీపంలో కాలువలో కొట్టుకపోతుండగా కొందరు రైతులు గమనించి బయటకు తీశారు. ఈ విషయంపై దువ్వూరు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలకు అవార్డు

వరుసగా మూడోసారి ఘనత

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 7: కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపికైంది. ఏప్రిల్ నెలలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు, ఉత్తీర్ణత శాతం సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పాఠశాలను ఎంపిక చేస్తూ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంటు ఎగ్జామినేషన్ డి. దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ పాఠశాల అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మికి అందజేయనున్నారు. విజయవాడ మంగళగిరి ఏపీఎస్పీ క్యాంపు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 10వ తేదీలోగా రిపోర్టు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆదేశించారు. 2021-22, 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో వరుసగా ఉత్తమ అవార్డుకు ఈ పాఠశాలగా ఎంపికైంది. మూడో సారి ఎంపిక కావడం హర్షణీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు.


డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 7: జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు కార్యాచరణ, ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కార్యచరణ ప్రణాళిక రూపకల్పనపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక, ఏడాది ప్రణాళిక, ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికపై ముఖ్యమంత్రి ప్రతి నెలా కలెక్టర్లతో సమీక్ష చేపడతారన్నారు. ఇరిగేషన్ డిపార్టుమెంటుకు సంబంధించిన ప్రాజెక్టులకు మరమ్మతులు, రిజర్వాయర్లను, మైనర్ ఇరిగేషన్, ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడం, ఆయకట్టుకు నీరు ఇవ్వడం తదితర అంశాలను ప్రణాళికల్లో చేర్చాలన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ కారిడార్ అభివృద్ధి, సింగిల్ విండో అనుమతులు, పీపీపీ బేస్డ్ ప్రాజెక్టు అంశాల మీద పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ సమన్వయంతో యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. గ్రామ పంచాయతీలో 250 నుంచి 500 మంది ఉన్న జనాభా ఉండే 10 గ్రామ పంచాయతీల్లో ఐదేకరాల్లో ప్రభుత్వ భూమిలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా కొత్త ఇసుక రీచుల గుర్తింపు, అక్రమ రవాణా అరికట్టడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కస్తూర్బా ఎస్‌వోపై ఎమ్మెల్యే ఆగ్రహం


పాఠశాలలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, ఆగస్టు 7: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో విద్యార్థినులకు అందించే భోజనం మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పకపోవడంతో ఎస్‌వోపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల లో ఆన్‌లైన్‌లో సీట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు సమాచారం ఇవ్వకుండా లేటైందని ఈ సీట్లను వైసీపీ నాయకులతో కుమ్మక్కై అధికారులు డబ్బులకు అమ్ముకున్నారని తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సి.బెళగల్ కస్తూర్బా ఎస్‌వోపై కలెక్టర్‌కు, విద్యాధికారికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

సాగునీరు దుర్వినియోగం చేయొద్దు: రైతులు సాగునీరును దుర్వినియోగం చేయవద్దని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సూచించారు. బుధవారం మండలంలోని తుంగభద్రనది తీరంలో ఉన్న సంగాల గ్రామంలో ఉన్న పంపుహౌవులో మోటార్లను ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల రైతులు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంబందహాల్, చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి, మాలేసోమపురం, సి.బెళగల్, పలుకుదొడ్డి గ్రామాల్లోని రైతులు ఐకమత్యంతో ఎత్తిపోతల పథకాలను నడుపుకోవాలన్నారు.

ఖాతా నుంచి నగదు మాయం

కోడుమూరు(రూరల్), ఆగస్టు 7: మండలంలోని మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన కురువ ఆనంద్ అనే యువకుడి బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైంది. దీనిపై బాధితుడు ఆనంద్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం తనకు యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి నగదు కట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయని అన్నారు. గమనించి చూడగా వరుసగా రూ.4,500, రూ. 5వేలు చొప్పున ఖాతా నుంచి మాయం అయినట్లు గుర్తించానని, ఈవిషయంపై బుధవారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

పీఎంకేసీవై పథకంలోకి

వేదవతి ప్రాజెక్టును చేర్చాలి

కేంద్ర జలశక్తి మంత్రికి ఎంపీ బస్తిపాటి వినతి


కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 7: జిల్లాలోని వేదవతి ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన పథకం కింద చేర్చాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. బుధవారం డిల్లీలోని కేంద్ర జలశక్తి మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్‌ను కలిసి ఓ వినతి పత్రం ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని మంత్రి పాటిల్‌కు వివరించారు.

వైభవంగా గోదా జయంతి


గోదాదేవి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 7: నగర శివారులోని మామిదాలపాడులోగల గోదా రంగనాథస్వామి (గోదా గోకులం) దేవస్థానంలో గోదాదేవి అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామునుంచే ఈ వేడుకలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకులు


మంత్రి నారా లోకేశ్‌తో మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి

ఓర్వకల్లు, ఆగస్టు 7: ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం మంగళగిరిలోని తన కార్యాలయంలో ఓర్వకల్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గుట్టపాడు సర్పంచ్ ఎం.మోహన్ రెడ్డి, మండల నాయ కుడు చదువులు సుధాకర్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసారు. గుట్టపాడు సమీపాన నూతనంగా నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్ (ఉక్కు పరిశ్రమ) అక్టోబరు నెలలో ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు రావాలని వారు ఆహ్వానించారు. ఈసందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ఓర్వకల్లును ఇండస్ట్రీరియల్ హబ్‌గా తీర్చి దిద్దడమే లక్ష్యమన్నారు. టీజీ భరత్‌ను పరిశ్రమల మంత్రిగా చేశామని, ఆయన ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఎన్నో పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డును పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు, ఆగస్టు 7: నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ బిందుమాధవ్ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. సీఐ, ఎస్‌ఐ లకు, పోలీసు సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలోని రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, వార్డు హిస్టరీ షీట్స్‌ను పరిశీలించారు. ఎప్పటికప్పుడు వారి ఫొటోలను అప్‌డేట్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రికార్డులు, రిసెప్షన్, లాకప్, జనరల్ డైరీ, సిబ్బంది వివరాలను పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం కేసుల వివరాలను ఆరా తీశారు. సిబ్బందికి రొటేషన్ పద్ధతిలో విధులు కేటాయించాలని తెలిపారు. ఆయన వెంట సీఐ మురళీధర్ రెడ్డి, ఎస్‌ఐ మన్మథ విజయ్ ఉన్నారు.

అరుంధతీనగర్‌లో చోరీ

కర్నూలు, ఆగస్టు 7: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరుంధతీనగర్‌లో జైబాన్‌బీ అనే మహిళ ఇంట్లో చోరీ జరిగింది. జైబాన్‌బీ, ఆమె భర్త చాంద్‌బాషాలు మంగళవారం పని నిమిత్తం బయటకు వెళ్లారు. బుధవారం వచ్చి ఇంటికి వచ్చి చూస్తే ఇంట్లో తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా అంతా చిందరవందరగా ఉంది. బీరువలో ఉన్న సుమారు 4 తులాల బంగారు నగలు, వెండి నగ లు, రూ. 2లక్షల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. దీంతో బాధి తులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్లూజ్ టీమ్ సాయంతో వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాధవీ నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు, ఆగస్టు 7: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాధవీ నగర్‌లో బుధవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. ఇందుమతి అనే మహిళ శకుంతల కళామండపం వద్ద కర్రీస్ పాయింట్ నిర్వహిస్తోంది. సాయంత్రం దుకాణం బంద్ చేసి మాధవీనగర్‌లో రవీంద్ర పాఠశాల వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా.. బైక్‌పై వచ్చిన ఆగంతకుడు ఆమె మెడలోని గొలుసును తెంపుకుని ఉడాయించాడు. బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకుండాపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. అపహరణకు గురైన గొలుసు విలువ 3 తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై స్పెషల్ డ్రైవ్

కర్నూలు, ఆగస్టు 7: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు రాధాకృష్ణ థియేటర్, నెహ్రూ రోడ్డు, మించిన్ బజారు తదితర ప్రాంతాల్లో ఈ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన పలు వాహనాలకు జరిమానాలు విధించారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న చిరు వ్యాపారుల బండ్లను తొలగించారు.

సిబ్బంది బాధ్యతగా మెలగాలి: ఆర్డీవో


వీఆర్వోలతో సమీక్షిస్తున్న ఆర్డీవో శేషిరెడ్డి

కల్లూరు, ఆగస్టు 7: విధుల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది బాధ్యతగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి ఆదేశించారు. బుధవారం కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో ఆయన అధికారులు, వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వాగులు, వంకలు, ఇరిగేషన్, ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డ్ భూముల్లో అడ్డదిడ్డంగా పట్టాలు తయారు చేస్తున్న వీఆర్వోలకు శిక్ష తప్పదన్నారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నారని, తప్పుచేస్తే వేటు తప్పదని అన్నారు. ఈ సమావేశంలో కల్లూరు తహసీల్దార్ కె. ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తాం


మాట్లాడుతున్న గోవిందరెడ్డి

ఓర్వకల్లు, ఆగస్టు 7: సూపర్ సిక్స్ పథకాలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఐఏఎస్, ఐపీసీలకు గౌరవం తగ్గించేలా పాలన సాగిందని, కానీ తమ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తొలి సమావేశంలోనే వారికి గౌర వం తెచ్చేలా నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, అల్లాబాబు, మోహన్‌బాబు, గుట్టపాడు చిన్న, యాసీన్‌బాషా, అయూబ్ బాషా పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి: టీడీపీ

గూడూరు ఆగస్టు 7: గూడూరులో నూతన తహసీల్దార్ భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని టీడీపీ సీని యర్ నాయకుడు, మాజీ వైస్ ఛైర్మన్ కురకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయడు, రేమట వెంకటేశ్వర్లు, పోలు అన్నారు. బుధవారం గూడూరులో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులుకు టీడీపీ నాయకులు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరులో తహసీల్దార్ భవనం లేక పాత భవనంలోనె రెవెన్యూ అధికారులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిల దృష్టికి తీసుకెళ్ళి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు దండు సుందరరాజు, సృజన్, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి కోడుమూరు షాషావలి, కౌన్సి లర్ బుడ్డంగలి, మన్నన్ బాషా, రహిమాన్, కోప్షన్ సభ్యుడు రామాం జనేయులు, ఇసాక్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై సమీక్ష

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 7: స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగం గా మాన్యువల్ స్కావెంజర్ ఉపాధి నిషేధం, వారి పునరావాసానికి సంబ ంధించి కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయం నిర్వహించిన కాన్ఫరెన్సులో కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి హాజరయ్యారు. అంతకన్నా ముందు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో సీబీజీ ప్లాంట్స్ ఏర్పాటుకు సంబంధించి టెలికాన్ఫరెన్సులో కమిషనర్ పాల్గొన్నారు. ఆరోగ్యఅధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, డీసీపీ సంధ్య పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు ఏర్పాట్లు

ఓర్వకల్లు, ఆగస్టు 7: పాఠశాలల యాజమాన్యాల కమిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని మండల విద్యాధికారి ఓంకార్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 48 ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణ రిటర్నింగ్ అధికారులుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉంటారన్నారు.

నిర్మాణాలపై అధికారులు శ్రద్ధ చూపాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 7: నగర పాలక సంస్థ పరిధిలో జరు గుతున్న వివిద నిర్మాణాలపై పనులపై అధికారులు శ్రద్ధ చూపడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇ.పుల్లారెడ్డి విమర్శించారు. బుధవారం సంఘం సభ్యులతో కలిసి పాతబస్టాండు, అర్బన్ బ్యాంకు, వడ్డేగేరి ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ కొన్ని చోట్ల రోడ్డు మ్యాన్‌హోల్‌కు మూతలు వేయకపోవడంతో వర్షం వచ్చినప్పుడు వాహనదారులు, పాదచారులు అం దులో పడిన ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. కొన్ని ప్రాం తాలలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ కార్పొరేటర్ ఏ.బాలరాజు, సభ్యులు రమణగౌడు, సీవీ.వర్మ, నాగరాజు, ఎస్.మక్బూల్ పాల్గొన్నారు.

‘ఆదివాసీ హక్కుల అఖిల భారత సదస్సును జయప్రదం చేయండి’

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 7: ఆదివాసీ హక్కుల అఖిల భారత సదస్సు హైదరాబాదులో ఈనెల 9, 10 తేదీల్లో హైదరాబాదులో జరుగుతుందని, దీన్ని జయప్రదం చేయాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని వేదిక కార్యాలయంలో సదస్సు వివరాలు తెలిపే పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆదివాసీలపై దాడులు జరుగుతున్నాయని, అటవీ ప్రాంతంలో ఉన్న వనరుల కోసం కార్పొరేట్ కంపెనీలు దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు అనుగుణంగా చట్టాలను మారుస్తున్నారని అన్నారు. ఆదివాసులను, మావోయిస్టులను నిర్మూలించడానికి ఆపరేషన్ కగార్ అనే యుద్ధాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. దీనికి వ్యతి రేకంగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరుగుతున్నట్లు తెలిపారు. ఇందులో వేదిక కార్యవర్గ సభ్యుడు మనోహర మాణిక్యం, రైతుకూలీ సంఘం నాయకుడు సుంకన్న, ప్రజా సంఘాల నాయకులు డేవిడ్, రత్నం ఏసేపు, సుబ్బరాయుడు, రవికుమార్, సీసీఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు

చేనేత కార్మికులను ఆదుకోండి

కర్నూలు(అగ్రికల్చర్)/(హాస్పిటల్), ఆగస్టు 7: చేనేత కార్మికులను ఆదుకోవాలని కుర్ని సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట 10వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద సంఘటిత ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న రంగాల్లో చేనేత ఒకటని, ఈ రంగంలో పని చేస్తున్నవారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తివేయాలి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): చేనేత వస్త్ర ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తివేయాలని అఖిల భారత చేనేత సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం 10వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ చేనేత వస్త్ర ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించాలని కోరారు.


గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న చేనేత సంఘం నాయకులు

బీపీ మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి


బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: కేంద్ర ప్రభుత్వం బీపీ మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయాచారి, బీసీ జేఏసీ కన్వీనర్ బత్తుల లక్ష్మీకాంతయ్య కోరారు. బుధవారం బీసీ భవన్‌లో బీపీ మండల్ కమిషన్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అలాగే కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఫెడరేషన్ సంఘం నాయకులు వేంపెంట రాంబాబు, కృష్ణయ్య యాదవ్, మధు యాదవ్, కృష్ణోజీరావు పాల్గొన్నారు.

గీత కార్మికులకు పథకాలు అందేలా చూస్తాం

కర్నూలు(అర్బన్), ఆగస్టు 7: కల్లుగీత కార్మికులను ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లాలోని కల్లుగీత కార్మి కులకు గుర్తింపు కార్డులు జారీ చేశారు. సీఐలు వాసుదేవ చౌదరీ, కే. చంద్రహాస్, ఎస్‌ఐలు ఫరూక్, ఎస్, చాంద్ బాషా, ఇంద్రకింగ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు(రూరల్), ఆగస్టు 7: కోడుమూరు సెబ్ పోలీసులు బుధవారం జరిపిన దాడుల్లో 450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చే శారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగరం తండాలో నాటుసారా కేంద్రంపై దాడి చేసి బెల్లం ఊటను పారబోసినట్లు తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్న వడిత్యా సుబ్బిబాయిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్వీసు రోడ్డు నిర్మించండి: సీపీఎం

కర్నూలు(రూరల్), ఆగస్టు 7: కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామ రైతులు పొలాలకు వెళ్లేందుకు బ్రిడ్జికి ఇరువైపుల సర్వీసు రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేవీ నారాయణ, మండల కార్యదర్శి పిబి. ఉశేనయ్య, మండల నాయకులు మృత్యుంజయ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషాకు ఈ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, ఆగస్టు 7: గూడూరులోని కొత్త ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణం పరిష్కరించాలని మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం గాలివానకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చెట్టు నెలకొరిగిందని దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు

క్విట్ కార్పొరేట్‌ను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 7: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు సంఘాల వ్యతిరేక విధానాలకు తిప్పికొట్టేందుకు ఈ నెల 9న చేపడుతున్న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవనన్‌లో కేంద్ర కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్య క్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, రైతు సం ఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, వ్య.కా.స జిల్లా కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కోడుమూరు ఎమ్మెల్యే



మఠంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఆగస్టు 7: కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బుధవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చ కులు తీర్థప్రసాదాలను అందించి శాలువ కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు శంకరయ్య, నవీన్, భాస్కర్ ఉన్నారు.

పోక్సో కేసులో మాజీ ఎమ్మెల్యేకు బెయిల్

కర్నూలు(లీగల్), ఆగస్టు 7: కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు జరదొడ్డి డా. సుధాకర్‌కు పోక్సో కేసులో బెయిల్ మంజూరైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సుధాకర్ కర్నూలులోని తన ఇంట్లో పని చేస్తున్న ఒక బాలికను బెదిరించి నాలుగేళ్ల పాటు పలుమార్లు అత్యాచారం చేసినట్లు ఆయనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో గత జూలై 4న కర్నూలు టూటౌన్ పోలీసులు సుధాకర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఆయనను కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. కోర్టు సుధాకర్‌ను రిమాండ్‌కు ఆదేశించింది. కాగా అయన తరపున న్యాయవాది పాలూరి రవిగువేరా పోక్సో కోర్టులో ఆయన తరపున బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న పోక్సో కోర్టు న్యాయాధికారి జి. ప్రతిభాదేవి ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

బాధిత కుటుంబాలకు చేయూత అభినందనీయం

కర్నూలు(అర్బన్), ఆగస్టు 7: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు చేయూతనివ్వడం అభినందనీయమని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. బుధవారం జిల్లా ఈఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఓబులేష్ ఆధ్వర్యంలో పలు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు.

ఆర్యవైశ్యులకు ప్రోత్సాహం ఇవ్వండి: సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 7: ఆర్యవైశ్యులను నామినేటెడ్ పదవులతో పాటు రాజకీయంగా ప్రోత్సహించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పదవులలో ఆర్యవైశ్యులకు స్థానం కల్పించి వారి రాజకీయ ఉన్నతికి దోహదపడాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 7: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని కర్నూలు మెడికల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అరుణ అన్నారు. బుధవారం కర్నూలు మండలం మునగాలపాడు అంగన్ వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన వైద్యులు డా.వెంక టేశ్వర్లు, ఎస్ఆర్ డాక్టర్ అలి, లెక్చరర్లు సురేష్, రజిత, హెల్త్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

‘విద్యార్థులు బాగా చదువుకోవాలి’

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 7: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం దూపాడులోని కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీ సుబ్బారెడ్డి మాట్లాడారు.

కరెంట్‌తో జాగ్రత్తగా ఉండాలి

తుగ్గలి, ఆగస్టు 7: వ్యవసాయ తోటల్లో రైతులు కరెంట్‌తో జాగ్రత్తగా ఉండాలని మండల విద్యుత్ ఏఈ మహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం తుగ్గలి, ఎద్దులదొడ్డి తదితర గ్రామాల్లో వ్యవసాయ తోటల్లో విద్యుత్ సరఫ రాను పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడుతూ ఈదురుగాలులు ఎక్కు వగా ఉండటం వల్ల విద్యుత్ వైర్లు తెగబడే ప్రమాదం ఉందని, అలాగే వర్షాకాలంలో తడిగా ఉన్న చేతులతో వ్యవసాయ మోటర్ల స్విచ్‌బోర్డులను తాకరాదన్నారు.

నాణ్యమైన భోజనం అక్షయ పాత్రతోనే సాధ్యం

ఆదోని టౌన్, ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు, ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మార్కెట్ యార్డ్‌లలోని రైతులకు ప్రభుత్వం అందిస్తున్న భోజనంలో నాణ్యత ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో, భోజన ఏర్పాట్లను అక్షయ పాత్రకు అప్పగించాలని సామాజిక కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈ పథకం కాంట్రాక్టు కోసం కూటమిలోని వివిధ పార్టీలకు చెందిన కింది స్థాయి నాయకులు తీవ్రమైన పోటీ పడుతున్నారని అన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన రుచికరమైన భోజనం అందించేందుకు వీలుగా అక్ష యపాత్రకు ఈ కార్యక్రమాన్ని అప్పగించాలని, ఈ మేరకు సీఎం చంద్ర బాబు నాయుడుకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరం

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు7: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధా నాలు దేశానికి ప్రమాదకరంగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడు పేర్కొన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఎమ్మిగ నూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లోని గ్రామ శాఖ కార్యదర్శులతో సమావేశాన్ని తిమ్మాపురం గ్రామ శాఖ కార్యకదర్శి వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంపన్నగౌడు మాట్లాడుతూ అతికష్టం మీద మిత్రపక్షాల సహకారంతో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం కార్పొ రేటర్లకు లాభం చేకూర్చే పద్ధతిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ బడ్జెట్ వల్ల కార్మికులకు, కర్షకులకు, రైతులకు, మధ్యతరగతి, సామాన్య ప్రజలకు ఏవిధమైన ఉపయోగం లేదని అన్నారు. ఈ సమావేశంలో గోనె గండ్ల, ఎమ్మిగనూరు, నందవరం మండలాల సీపీఐ నాయకులు చిన్నన్న, నాగప్ప, మద్దిలేటి నాయుడు, తిమ్మగురుడు, విరుపాక్షి, రాజీవ్, మాలిక్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములు పంపిణీ చేయాలి

మద్దికెర, ఆగస్టు 7: మండలంలోని హంపా, బొమ్మనపల్లి, ఎడవలి గ్రామాల్లో గల ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంపిణీ చేయా లని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి మదనంత పురం హనుమన్న, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కోదండరా ముడు అన్నారు. బుధవారం తహసీల్దార్ ఉశేన్ సాహెబ్‌ను మర్యాదపూర్వ కంగా కలిశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 200 ఎకరాలు మిగులు భూమి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ భూములను పేదలకు అందేలా చూడాలన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉశేన్ సాహెబ్‌ను జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విశోభ కలిసారు. బుధ వారం స్థానిక నాయకులు ఆయన్ను కలిసి ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెడికల్ రాము, శాంతిరెడ్డి, చెన్నంపల్లి మల్లికార్జున, సాయినగర్ బాషా ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్ మృతి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 7: ఆదోని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహి స్తున్న కండక్టర్ సిద్ధయ్య (55) బుధవారం మృతి చెందారు. సిద్ధయ్య మంగళవారం ఉరుకుంద స్పెషల్ డ్యూటీ ముగించుకొని రాత్రి ఇందిరానగ ర్‌లోని రూమ్‌కి వెళ్లి నిద్రించారు. ఉదయం డ్యూటీకి రావాల్సి ఉండగా డ్రైవ ర్‌తో పాటు ఆర్టీసీ సిబ్బంది ఫోన్ చేశారు. ఎంతసేపటికి ఫోన్ లిఫ్ట్ చేయక పోవడంతో ఇందిరాగనర్‌లోని ఆయన ఉండే రూమ్‌కి వెళ్లి పరిశీలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు గమనించి డిపో మేనేజర్‌కు సమా చారం ఇచ్చారు. ఆయన సొంత ఊరు కడప జిల్లా బద్వేల్ తాలూకా బొర్లం పల్లి అని తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

'చేనేత పథకాలను అమలు చేయాలి'

ఎమ్మిగనూరు, ఆగస్టు 7: చేనేతల అభివృద్ధికోసం సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏపీ చేనేతకార్మిక సంఘం పట్టణ కార్యదర్శి భరణి కాలప్ప, నాయకులు లక్ష్మన్న, కృష్ణ, సీఐటీయూ మండల అధ్యక్షకార్యదర్శులు గోవిందు, రాముడులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినో త్సవాన్ని పురస్కరించుకొని మాచాని సోమప్ప విగ్రహానికి, గాంధీ విగ్రహా లకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సంఘం ఆధ్వ ర్యంలో గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. నాయకులు కనికే లక్ష్మన్న, మాదుగుండు రాజు, ఎల్లప్ప, తిమ్మప్ప, మాచాని గోవిందు, వెంకటే శ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా వేయండి

● బందోబస్తు కల్పించలేం ● సర్క్యులర్ జారీ చేసిన పోలీసులు

ఆలూరు, ఆగస్టు 7: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ గురువారం స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికల్లు నిర్వహించేందుకు సిద్ధ మైంది. అయితే ఆలూరు మండలంలోని ఆరు పాఠశాలల్లో మాత్రం ఎన్ని కలు వాయిదా వేయాలంటూ ఎస్ఐ ఓబులేసు విద్యాశాఖ అధికారులకు సర్క్యులర్ జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. వాయిదా వేసేం దుకు పోలీసులకు ఎలాంటి అధికారం లేదంటూ విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్నికలు నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. తమ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే ఎన్నికలను వాయిదా వేస్తామని ఎంఈఓ-2 చిరంజీవి రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇచ్చామనిన్నారు. ఇప్పటికిప్పుడు మొలగవల్లి, మొలగవల్లి కొట్టాల, తుంబల బీడు, పెద్దహో తూర్, కమ్మర చేడు, హులేబీడు గ్రామాల్లో ఎన్నికలు వాయిదా వేస్తే ఎలా గని అధికారులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఘర్షణలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, తాము అంతమేర బందోబస్తు కల్పించలేమని, ప్రస్తుతానికి ఎన్నికలు వాయిదా వేయాలంటూ ఎస్ఐ తన సర్క్యులర్‌లో వెల్లడించారు.

చేనేతలను మరిచిన వైసీపీ : ఎమ్మెల్యే బీవీ

● చేనేత కార్మికులందరికీ గుర్తింపు
● కార్డులు, యారం డిపో ఏర్పాటుకు కృషి
● ఎమ్మిగనూరులో ఘనంగా జాతీయ చేనేత దినం


చేనేతలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న బీవీ

ఎమ్మిగనూరు, ఆగస్టు7: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చేనేతలను ఎవరూ పలకరించిన పాపానపోలేదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సోమప్ప కూడలిలో చేనేతపిత పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. అక్కడి నుంచి చేనేత కార్మికులతో కలిసి తేరుబజారు వరకు ర్యాలీ నిర్వహించారు. తేరుబజారులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాల నలో చేనేత కార్మికులు ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. నేతన్న నేస్తం పేరుతో అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపు కున్నారని అన్నారు. తమ ప్రభుత్వం చేనేత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకానికి అర్హులయ్యేవిధంగా చూస్తుందని అన్నారు. అలాగే యారం ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని సబ్సిడీకి అందించేందుకు స్థానికంగానే డిపోలు త్వరలో ఏర్పాటు చేస్తా మని అన్నారు. అనంతరం సీనియర్ చేనేత కార్మికులను శాలువ, పూలదం డతో ఘనంగా సన్మానించారు. అలాగే 100 మందికి గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్లు రాందాసుగౌడు, దయాసాగర్, టీడీపీ చేనేత నాయకులు మాచాని శివశంకర్, చేనేత మల్లి, శివకుమార్, మినప్ప, పట్టా నాగరాజు, రంగస్వామి, కామార్తి మహేష్, దేవేంద్ర, కనికె నాగరాజు, వెంకటేశులు, లక్ష్మన్న, మాస్టర్ వీవర్స్ నజీర్, మాజీ కౌన్సిలర్లు రంగస్వామిగౌడు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం: ఎమ్మెల్యే


ఫిల్టర్‌బెడ్ మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ, ఆగస్టు 7: పత్తికొండ పట్టణానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పందికోన రిజర్వాయర్ సమీపంలోని కొత్తపల్లి మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్ మరమ్మతులను ఆయన బుధవారం పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పత్తికొండ పట్టణానికి శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం కొత్తపల్లి మంచినీటి పథకం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వహయాంలో మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్‌ల పర్యవేక్షణ లేకపోవడం, మరమ్మతులు పట్టించుకోకపోవడంతో కొళాయిల ద్వారా మంచినీటికి బదులు మురుగు నీరు వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కారం పుస్తకంలో పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులపై ఫిర్యాదు రావడంతో వెంటనే సంబం ధిత శాఖ అధికారులతో మాట్లాడి రూ.10 లక్షలతో ఫిల్టర్ బెడ్‌ల మరమ్మ తులు చేపట్టామన్నారు. ఇక నుంచి సురక్షితమైన తాగునీరు కొళాయిల ద్వారా సరఫరా అవుతుందన్నారు. నలకదొడ్డి గ్రామంతో పాటు మరో 5 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామ న్నారు. నియోజకవర్గంలో సాధ్యమైనంత వరకు పొలాలకు సాగునీరు అందించడం కోసం, అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. టీడీపీ నాయకులు శ్రీధర్ రెడ్డి, కృష్ణ, నరసింహచౌదరి, చక్కా గోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్ షఫి, గ్రామ పంచాయతీ ఈవో నరసింహులు తదితరులు ఉన్నారు.

మురుగు కాలువ నిర్మించాలి: ఎమ్మెల్యే

దూదేకొండ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన మురుగుకాలువను నిర్మించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అధికారులను ఆదేశించారు. కొత్తప ల్లికి వెళ్తున్న ఆయన రహదారి పక్కన పారుతున్న మురగునీటిని చూసి వాహనం నుంచి దిగి పరిశీలించారు. మహిళలతో మాట్లాడారు. గతంలో ఎందరో అధికారుల దృష్టికి కాలువ నిర్మాణంపై అర్జీలు పెట్టుకున్నా పట్టిం చుకోలేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మద్యం తరలింపుపై నిఘా పెంచాలి

● అనంతపురం సబ్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్

ఆదోని, ఆగస్టు 7: కర్ణాటక, తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలో అక్రమ మద్యం రాష్ట్రంలోకి రవాణా కాకుండా నిఘా పెంచాలని అనంతపురం సెబ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ శేఖర్ సూచించారు. బుధవారం ఆదోని సెబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులు, ప్రాపర్టీ వివరాలు, పట్టుబడిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకు న్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ వినీలత పాల్గొన్నారు.

ఆలూరు: కర్ణాటక మద్యం రవాణకు మరింతగా అడుకట్ట వేసేందుకు సరిహద్దు చెక్ పోస్టులో నిఘా మరింతగా పెంచుతామని అనంతపురం సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. బుధవారం ఆలూరు సెబ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు.

కోసిగి: కోసిగిలోని సెబ్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం అనంతపురం సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ మహ బూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబుకు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి, అలాగే అక్రమ మద్యం తరలిస్తూ పట్టు బడిన వాహనాలను, మద్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది నాగరాజు, మధు ఉన్నారు.

సీఐని కలిసిన నాయకులు


సీఐను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, ఆగస్టు 7: కొత్తగా బాధ్యతలు చేపట్టిన కోసిగి సీఐ బీఏ మంజునాథ్‌ను బుధవారం కోసిగి మండల టీడీపీ నాయకులు పెండ్యాల భరద్వాజ్‌శెట్టి, కొండగేని వీరారెడ్డి, పంపాపతి, నర్సారెడ్డి, వీరారెడ్డి, మహాదేవ, నరసింహులు వీరారెడ్డి కలిశారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సీఐని సన్మానించారు. ఎంపీటీసీ రాజు, రాజశేఖర్ రెడ్డి, మారెప్ప, రామాంజనేయులు, శ్రీను, ప్రభాకర్ రెడ్డి, చంద్ర, హను మంతు, అంజిరెడ్డి, నాగరాజు, హనుమంతు, తదితరులు ఉన్నారు.

కనకవీడులో కూలిన మిద్దె

నందవరం, ఆగస్టు 7: మండల పరిదిలోని కనకవీడు గ్రామానికి చెందిన పెద్ద రంగన్నకు చెందిన మిద్దెకూలి నష్ట వాటిల్లిందని పెద్ద రంగ న్న తెలిపారు. మంగళవారం కురిసిన వర్షానికి కూలిందని టీడీపీ బూత్ కన్వీనర్ రాజు కూలిన మిద్దెను పరిశీలించారు. మంగళవారం కురిసిన వర్షంకు మిద్దె కూలిందని అధికారులు స్పందిచి పేద కుటుంబానికి చెందిన రంగన్నకు కొత్త ఇళ్లను మంజురు చేయాలని కోరారు. ఈ విషయంపై ఆర్ఐ జర్మియాను కోరగా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

వెల్దుర్తి, ఆగస్టు 7: మండలంలో రామళ్లకోట గ్రామంలో ఆర్థిక ఇబ్బం దులతో రైతు కల్లా రామకృష్ణుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసు కున్న విషయం విదితమే. బుధవారం తహసీల్దారు చంద్రశేఖర వర్మ, ఎస్ఐ సునీల్ కుమార్, మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాషాలతో కలిసి గ్రామంలో రైతు ఆత్మహత్యపై కుటుంబ సభ్యులను విచారించారు. తదుపరి నివేదిక ప్రభుత్వానికి పంపనున్నారు.

ఆదోని అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని/ఆదోని టౌన్, ఆగస్టు 7: ఆదోని పట్టణ అభివృద్ధిపై ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానా లకు కట్టుబడి ఉన్నానని, ఐదేళ్ల కాలంలో అన్ని పను లను అందరి సహకారంతో పూర్తి చేస్తానని ఎమ్మెల్యే డా. పార్థసారథి అన్నారు. పట్టణంలోని వాసవి కళ్యాణమందిరం రేనోవేషన్ ఏపీ ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారం భించారు. ముందుగా నగరేశ్వర స్వామి దేవాలయం నుంచి కల్యాణ మంటపం వరకు ఎమ్మెల్యేను ఆర్య వైశ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలి కారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి టీజీ శివరాజ్ కళ్యాణ మందిరం సేవా సమితి అధ్యక్షుడు టీజీ పాండురంగయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి మిరియాల మారుతి కుమార్, విట్టా రమేష్, టీజీ రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

లారీ బోల్తా

వెల్దుర్తి, ఆగస్టు 7: పట్టణంలో జాతీయ రహదారి-44 అంజనేయస్వామి కూడలిలో బుధవారం తెల్లవారుజామున మదనపల్లె నుంచి నాగపూర్‌కు టమోటా లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ సాయి ప్రసాద్, క్లీనర్ సురేష్‌లు సురక్షితంగా బయటపడ్డారు. హైవే పోలీసులు, సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని లారీని పక్కకు తప్పించి వాహన రాకపోకలకు మార్గం సుగమం చేశారు. టమోటా బాక్సులు, లారీ దెబ్బతినడంతో రూ.2లక్షలు ఆస్తినష్టం వాటిల్లిందని తెలి పారు. కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్ ఉందని, ఎటువంటి వేగ నియంత్రణ బోర్డులు, సూచికలు లేకపోవడంతో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో రోడ్డు వర్షంతో తడిసిపోయి ఉన్నందున లారీ అదుపు తప్పి ప్రమాదం జరిగిందని డ్రైవర్ తెలిపారు.

నందవరం తహసీల్దారుగా శ్రీనివాసులు

నందవరం, ఆగస్టు 7: నందవరం మండల తహసీల్దారుగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు ఓబు లేసు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవా డలోని సచివాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసులు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రజా సమస్యలు, రైతు భూముల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈయనతో పాటు ఆర్ఐ జర్మియా ఉన్నారు.

అందరికీ పరిహారం ఇస్తాం

● సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ


మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఆగస్టు 7: ఆదోని జాతీయ రహదారి కోసం భూములు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందజేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారా యణ్ శర్మ పేర్కొన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నేషనల్ హైవే కోసం భూమిలిచ్చిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ రహ దారి కోసం 830 మంది 23,636 హెక్టార్ల భూమి సేకరించామని తెలిపారు. భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలు ప్రకారం పరిహారం అందజేస్తామని తెలియజేశారు.

ఆయాలపై రాజకీయ వేధింపులు ఆపాలి


పత్తికొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఏఐటీయుసీ నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో ఏళ్లుగా చాలీ చాలని జీతాలతో పని చేస్తున్న ఆయాలు (స్కావెంజర్ల)ను రాజకీయ వేధిం పులతో అధికార పార్టీ నాయకులు ఆయాలను తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణ, నియోజకవర్గ అధ్యక్ష కార్యద ర్శులు సెట్టికంటయ్య, రంగన్న, సీపీఐ జిల్లా నాయకులు మద్దిలేటిశెట్టి అన్నారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్ నుంచి ఏఐటీయుసీ ఆధ్వర్యంలో స్కావెంజర్లు ర్యాలీ నిర్వహించి నాలుగు స్థంభాల కూడలిలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయాలను రాజకీయ వేధింపులతో తొలగించిన హెచ్ఎం, ఎంఈవోలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దు

● రాయలసీమ జోన్ సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్

పత్తికొండ టౌన్, ఆగస్టు 7: విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని రాయల సీమ జోన్ సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ సిబ్బందికి సూచించారు. బుధవారం పత్తికొండకు వచ్చిన ఆయన స్థానిక సెబ్ పోలీస్‌స్టేషన్‌ను అక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీ లించి, సీజ్ చేసిన వాహనాలు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీ వివరా లను, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా అక్రమ మద్యం, ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ సెబ్ ఎస్ఐ కార్తీక్‌సాగర్, హెడ్ కానిస్టేబుల్ వరదరాజులు, సర్దార్ హుశేన్, మాబుపీరా, కానిస్టేబుల్లు మదన్‌మోహన్, వెంకటేశ్వర్లు, నాగరాజు, యశో దమ్మ తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

తుగ్గలి, ఆగస్టు 7: పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్ల ఎన్నికలను ప్రశాం తంగా నిర్వహించాలని జొన్నగిరి ఎస్ఐ చంద్ర తెలిపారు. బుధవారం మండల పరిధిలోని జొన్నగిరి తదితర గ్రామాల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం నిర్వహించే ఎస్ఎంసీ చైర్మన్ల ఎన్నికలను ప్రశాం తంగా నిర్వహించాలని అన్నారు.

కౌతాళం: మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు అంజనేయులు, శోభారాణి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల కొనసాగుతాయని ఈ ఎన్నికలు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఓటింగ్ కొనతాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓటర్లుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉంటారని చెప్పారు.

జగన్‌కు మతిభ్రమించింది : టీడీపీ

దేవనకొండ, ఆగస్టు 7 : రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలన్న జగ న్‌కు మతిభ్రమించిందని టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మలకన్న, మండల టీడీపీ నాయకుడు బండిగింజల రంగన్న, వీరేష్ అన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడుతు గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేయని తప్పులంటూ లేదన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై నిజాలు వెలికితీయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంత్రాలయం, ఆగస్టు 7: మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన రచ్చుమర్రి మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థిని పార్వతి ఆత్మహత్యకు గల కార ణాలను వెలికితీయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా, జిల్లా సహాయ కార్యదర్శి థోమాస్ డిమాండ్ చేశారు. బుధవారం మంత్రాలయం ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి రాఘవేంద్ర సర్కిల్‌లో నాలుగు రోడ్లను దిగ్బంధం చేస్తూ భైఠాయించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ నాయ కులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థిని కురువ పార్వతి ఆత్మహత్య చేసుకోలేదని, హత్యేనని వారు ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ రవి, ఎస్ఐ గోపినాథ్, డిటీ రాఘవేంద్ర వినతి పత్రం సమర్పించారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తగవు

ఎమ్మిగనూరు, ఆగస్టు7: చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు తగ వని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కేఎండీ అనీఫ్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కార్మికుల సమావేశం కృష్ణ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా అనీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరు ఉద్యోగులు, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయని ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికులను కొత్తగా నియమించి వంటలు చేయిస్తున్నారని, దీంతో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న వంట కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఈ సమావేశంలో నాయకులు యేసేపు, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా


కడివెళ్లలో నీటి ట్యాంకర్‌తో తాగునీటిని సర ఫరా చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు7: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో టీడీపీ నాయకులు గ్రామ ప్రజలకు నీటి ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు నరసన్న, ఎంపీటీసీ హనుమంతు, లింగన్న, గుంటెప్ప మాట్లా డుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, రంజిత్, టీడీపీ నాయకులు రఘు పాల్గొన్నారు.

గోనెగండ్ల సీఐగా ఏ. గంగాధర్



గోనెగండ్ల, ఆగస్టు 7: గోనెగండ్ల మండల సీఐ ఏ. గంగాధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడ సీఐగా పనిచేస్తున్న రామకృష్ణయ్య కర్నూలు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. కర్నూలు వీఆ ర్‌లో ఉన్న సీఐ గంగాధర్ బదిలీపై గోనెగండ్లకు వచ్చారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

తుగ్గలి, ఆగస్టు 7: ఉపాధి కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఏపీవో రామకృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం తుగ్గలి ఏపీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లా డుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాల న్నారు. పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే.. సిబ్బందిపై చర్యలు తీసు కుంటామని, అలాగే రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో టీఏలు ప్రదీప్, రాజశేఖర్, ఫరీదప్ప, తదితరులు పాల్గొ న్నారు.

వైసీపీ పాలనలో చేనేతల అభివృద్ధి: బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 7 : రాష్ట్రంలో వైసీపీ పాలనలోనే చేనే తలు అభివృద్ధి చెందారని బుట్టా రేణుక అన్నారు. జాతీయ చేనేతల దినోత్సం సందర్భంగా బుట్టా రేణుక స్థానిక వైసీపీ కార్యాలయంలో పద్మశ్రీ మాచాని సోమప్ప చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నో చేనేత ప్రాంతాలు ఉన్నప్పటికీ ఎమ్మిగనూరుకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత మాత్రం పద్మశ్రీ మాచాని సోమప్పకే చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రగౌడ్, బసిరెడ్డి, మాచాని వెంక టేష్, బి ఎన్ నాగరాజు, యు కె రాజశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యం ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

హాలహర్వి, ఆగస్ట్ 7: నేడు జరగబోయే పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ఎస్సై నరేంద్ర ఉపాధ్యాయులను కోరారు. ఆయన బుధవారం మాట్లాడుతూ టీడీపీ, వైసీపీ నేతల మధ్య విభే దాలు రాకుండా సామరస్యంగా నిర్వహించాలని, సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, గొడవలు లేకుండా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు.

సర్వమూల గ్రంథ శాంతి పఠనం


సంస్కృత విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న పీఠాధిపతులు

మంత్రాలయం, ఆగస్టు 7: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మూల బృందా వనం ముందు ఎంతో విశిష్టమైన సర్వమూల గ్రంథ శాంతి పఠనం మంత్రాలయం పీఠాధి పతి సుబుధేంద్రతీర్థులు, బాలాగర్ అక్షోభతీర్థ మఠం పీఠాధిపతి అక్షోభ్య రామప్రియతీర్థులు పాఠాలు బోధించారు. బుధవారం రాజాఎస్ గిరిరాజాచార్ సంస్కృత వేద పాఠశాల విద్యార్థులకు, పండితులకు ఆ గ్రంథాల సారాంశాన్ని వివరిం చారు. ఎంతో భక్తిశ్రద్ధలతో విశిష్టత ఉన్న గ్రంథాల ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు పీఠాధిపతులు సమాధానం ఇస్తూ పఠనం సాగింది. కార్యక్రమంలో వాదిరాజాచార్, రమ ణారావు, వెంకటేశ్‌ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ముఖ్యమంత్రికి ఆహ్వానం


సీఎంకు ఆహ్వానపత్రం ఇస్తున్న మఠం అసిస్టెంట్ మేనేజర్

మంత్రాలయం, ఆగస్టు 7: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 353వ సప్తరాత్రోత్సవాలకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఉత్స వాల ఆహ్వాన పత్రికను మఠం అసి స్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి అందజేశారు. బుధవారం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఇచ్చిన రాఘ వేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం పీఠాధిపతితో ఫోన్‌లో మాట్లాడారు.

'వరద బాధితులకు అండగా ఉందాం'

ఆలూరు రూరల్, ఆగస్టు 7: కేరళలోని వయనాడ్‌లో ఘోరమైన వర దలో 400 మంది ప్రాణాలు పోగొట్టుకున్న బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించి అండగా ఉందాం అని సీపీఎం సీనియర్ నాయకులు కేపీ నారాయణ స్వామి కోరారు. బుధవారం సాయంత్రం ఆలూరులోని కేరళ వయనాడ్ బాధితులను అదుకునేందుకు సీపీఎం అధ్వ ర్యంలో విరాళాలు సేకరించారు. సీఐటీయూ నాయకులు కృష్ణ, ఈరన్న, డీవై ఎఫ్ఐ నాయకులు మైన, గోవర్ధన్, మహిళ సంఘం నాయకులు షేకున్ బీ, గౌసియ బీ, ఎస్ఎఫ్ఐ గిరిమూర్తి పాల్గొన్నారు.